క్లుప్తంగా

గట్ల నరసింహస్వామి ఆలయంలో చందనోత్సవం



గట్ల నరసింహస్వామి

బేతంచెర్ల: పట్టణానికి సమీపాన సంజీవనగర్ కాలనీలో వెలసిన గట్ల నరసింహ స్వామి ఆలయంలో అక్షయ తృతీయ సందర్భంగా చందనోత్సవం నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసులు స్వామికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి ఇచ్చి భక్తులకు దర్శనం కల్పించారు.

ప్రశాంతంగా ముగిసిన పాలిసెట్



ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

బనగానపల్లె రూరల్ : పట్టణంలో బుధవారం పాలిసెట్–2025 ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని కేజీఆర్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 200, శ్రీసాయి సిద్దార్థ జూనియర్ కళాశాలలో 150, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 200, వాసవి పాలిటెక్నిక్ కళాశాలలో 341 మంది..మొత్తం 831 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సివుండగా 72 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రాల కో ఆర్డినేటర్ రాజేష్ తెలిపారు. పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగింది.


ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ సమ్మర్ కోచింగ్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు పక్కన గల బుగ్గన శేషారెడ్డి మెమోరియల్ ఇండోర్ స్టేడియంలో నెలరోజుల పాటు షటిల్ బ్యాడ్మింటన్ సమ్మర్ కోచింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. స్టేడియం ఆవరణలో బుధవారం క్లబ్ సభ్యులతో కలిసి ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. 10 నుంచి 15 సంవత్సరాల లోపుగల బాల, బాలికలకు ప్రతి వేసవి కాలంలోనూ నెలరోజుల పాటు ఉచితంగా సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. వచ్చే వారం ప్రారంభమయ్యే సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో పాల్గొనేందుకు ఆసక్తి గల బాల, బాలికలు కౌన్సిలర్ నాగేంద్ర సెల్ : 8985702633 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

అవుకు: మండలంలోని గోకులదిన్నె గ్రామంలో బుధవారం పెద్దమ్మ జాతర ఘనంగా జరిగింది. గ్రామస్తుల ఆహ్వానం మేరకు హాజరైన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.అనంతరం కాటసాని రామిరెడ్డి పెద్దమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యర్రగుడిలో ..

కొలిమిగుండ్ల: యర్రగుడిలోని సాయిబాబా ఆలయంలో అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని పట్టు వస్త్రాలతో అలంకరించి విశేష పూజలు చేపట్టారు. అక్షయ తృతీయలో భాగంగా సంతానం కోసం దంపతులు పూజల్లో పాల్గొన్నారు. మామిడి పండ్ల రసంతో సాయిబాబాకు అభిషేకం చేశారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నైతిక విలువలు నేర్పించాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పిల్లలకు విద్యార్థి దశలోనే నైతిక విలువలు నేర్పించాలని రెవరెండ్ మేకల రాజేంద్రబాబు అన్నారు. స్థానిక సీఎస్‌ఐ చర్చిలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న విరామ బైబుల్ స్టడి కార్యక్రమం బుధవారం ముగిసింది. దేవుని ప్రేమ, కరుణ, త్యాగం వివరిస్తూ చిన్నతనం నుంచే ఎలా నడుచుకోవాలనే విషయాలపై కథలు, డ్యాన్సులు, పాటల రూపంలో శిక్షణ ఇచ్చినట్లు పాస్టర్ తెలిపారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని రైల్వే గేట్ నుంచి పాతబస్టాండ్ మీదుగా పిల్లలతో పాటు సంఘ పెద్దలు, తల్లిదండ్రులు ర్యాలీ చేపట్టారు.



ప్రధాన రహదారిపై విరిగిపడిన విద్యుత్ స్తంభం



ధాన్యంపై పట్టలు కప్పుతున్న రైతులు

గాలీవాన బీభత్సం

బనగానపల్లె : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం కురిసిన మోస్తరు వర్షం కురవగా.. గాలిబీభత్సం సృష్టించింది. ప్రధానంగా వరి, మొక్కజొన్న పంటలు నష్టానికి గురయ్యాయి. సాధుకొట్టం గ్రామం వద్ద ఆర్‌అండ్‌బీ రహదారిపై భారీ చెట్టు నేలకూలడంతో ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది. మీరాపురం మెట్ట వద్ద ఇంటిపై విద్యుత్ స్తంభం పడింది. అయితే ఇంట్లో ఉన్నవారికి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. మండలంలో సుమారు 1,800 ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా ఇప్పటికి 50 శాతం కోతలు పూర్తయ్యాయి. మిగిలిన పంట పంట నూర్పిడికి సిద్ధంగా ఉంది. అకాల వర్షాలతో పలుచోట్ల పైరు నేలవాలడంతో గింజలు రాలుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీచిన పెనుగాలులు, వర్షంతో మామిడి పంటకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు.



మీరాపురం మెట్ట వద్ద ఇంటిపై పడిన విద్యుత్ స్తంభం

కొలిమిగుండ్ల: ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉన్నా సాయంత్రానికి ఒక్క సారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. బుధవారం మండలంలో ఉన్నట్లుండి పెద్ద శబ్దాలతో ఉరుములు,మెరుపులు రావడంతో జనం భయాందళనకు గురయ్యారు. పెనుగాలులతో మోస్తారు వర్షం కురిసింది. కొలిమిగుండ్ల-కల్వటాల ప్రధాన రహదారిలోని దాఖానా యక్ బ్రిడ్జి సమీపంలో విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుపై పడింది. నెల్లూరు–ముంబై ప్రధాన రహదారి కావడంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనాలు పోయేందుకు మార్గం లేక అరగంటకు పైగానే నిలిచిపోయాయి. విద్యుత్ సిబ్బంది చేరుకొని తీగలను కట్ చేసి వాహనాలు పోయేందుకు మార్గం సుగుమం చేశారు.



సాధుకొట్టం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై కూలిన భారీ చెట్టు

సంజామల:ఒక వైపు ఎండలు మరోవైపు గాలీవానతో రైతులకు దిక్కుతోచడం లేదు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం గాలీవాన బీభత్సం సృష్టించింది. కల్లాలు, పొల్లాలో ఆరబోసుకున్న మొక్కజొన్న, మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



అవుకులో చెట్టు పడటంతో ధ్వంసమైన ఇల్లు



అవుకులో గాలులతో కూడిన వర్షం కురుస్తున్న దృశ్యం



అవుకు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఈదురుగాలులకు నేలమట్టమైన ఏళ్లనాటి వేపచెట్టు

- అవుకు: పట్టణంలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలుల దాటికి దశాబ్దాల కాలంనాటి చెట్లు కూకటివేలతో సహా నేలవాలాయి .అవుకు పట్టణంలో బుధవారం గాలివాన ధాటికి దాదాపు పదుల సంఖ్యలో చెట్లు నేలవాలాయి. సబ్‌రిజిస్టర్ కార్యాలయంలో దశాబ్దాల కాలం నాటి వేప చెట్టు గాలివాన ధాటికి ఒక్కసారిగా కూకటివేలతో నేల వాలింది. దీంతో పక్కనే దస్తావేజులు లేఖర్లు ఏర్పాటు చేసుకున్న షెడ్డు, స్టాంపు వెండర్ ఏర్పాటు చేసుకున్న షెడ్డు కూలిపోయాయి. అప్పుడే రిజిస్టర్లు చేయించుకోవడానికి వచ్చిన ప్రజలు, దస్తావేజులేఖర్లు వెళ్లిపోవడంతో ప్రాణాపాయం తప్పింది. అలాగే తేరు వీధిలో ఎన్నో ఏళ్ల క్రితం నాటి రావి చెట్టు వేర్లతో సహా విరిగి పక్కనే ఉన్న పీర్ల చావిడి, మాజీ సర్పంచ్ చల్లా అమర్నాథ్ రెడ్డి ఇంటిపై పడడంతో భవనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న శివాలయం సమీపంలో ,కొత్త రోడ్డు సమీపంలో పలుచెట్లు విరిగిపోయాయి. చెట్లు విరిగి కరెంటు తీగలపై పడడంతో పట్టణం మొత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయ మేర్పడింది.

మహాకవి శ్రీశ్రీకి ఘన నివాళి

డోన్: ఎవరో వస్తారని .. ఏదో చేస్తారని ఎదురుచూసి మోసపోకుండా స్వతంత్రంగా యువత జీవించడం అలవరుచుకున్న నాడే మహాకవి శ్రీశ్రీకి నిజమైన నివాళి అని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ అన్నారు. స్థానిక కార్యాలయంలో మహాకవి శ్రీరంగం శ్రీనివాసులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జేఏఓ హరిప్రసాద్, సీనియర్ అసిస్టెంట్‌లు ఉమాదేవి, పద్మ, టౌన్ ప్లానింగ్ శబరీస్ తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్ : తన సాహిత్యం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రజా కవి శ్రీరంగం శ్రీనివాసరావు అని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శ్రీ శ్రీ జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సుభాన్‌బాషా, రవీంద్రనాథ్‌శర్మ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీశ్రీకి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్

కౌన్సిలర్ కటిక వేణుకు పరామర్శ



కౌన్సిలర్ కటిక వేణును పరామర్శిస్తున్న మాజీ మంత్రి తనయుడు అర్జున్‌రెడ్డి

డోన్: వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పాతపేటకు చెందిన కౌన్సిలర్ కటిక వేణు గుండెకు శస్త్రచికిత్స చేయించుకున్న విషయాన్ని తెలుసుకున్న అర్జున్‌రెడ్డి బుధవారం ఆయన స్వగృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అర్జున్‌రెడ్డి వెంట రాష్ట్ర మాజీ మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సోమేష్ యాదవ్, మల్లికార్జునరెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు ఆర్‌ఈ రాజవర్దన్, జిల్లా ఉపాధ్యక్షులు కురుకుంద హరి, జిల్లా బీసీ సెల్ విభాగం అధ్యక్షులు పోస్టు ప్రసాద్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు తదితరులు ఉన్నారు.

బాలికల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం



కిశోరి వికాసం వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న అధికారులు

బేతంచెర్ల: బాలికల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తహసీల్దార్ ప్రకాశ్ బాబు, వైద్యురాలు సాగరిక, ఏఓ కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు తిప్పమ్మ, రాధమ్మ, ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో కిశోరి వికాసం స్పెషల్ సమ్మర్ క్యాపెంయిన్‌పై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బాలికలు ఎదుర్కొనే ఇబ్బందులు, బాల్య వివాహాలు నివారణ దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం కిశోరి వికాసం వాల్ పోస్టర్లను విడుదల చేశారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

అవుకు : బాల్యవివాహాలను అరికట్టాలని ఎంపీడీఓ వెంగన్న అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు అరికట్టేందుకు గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. డ్రాపౌట్ పిల్లల జాబితా తయారు చేసి ప్రత్యేక గ్రూప్ ద్వారా 2,4వ శనివారాల్లో సమావేశం నిర్వహించి ఆరోగ్యం పోషణ,రక్షణ, విద్య సాధికారత జీవిత నైపుణ్యాలపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఏపీఎం చంద్రశేఖర్, డాక్టర్ నవీన్, సూపర్‌వైజర్లు పావని, శివమ్మ పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల: కిశోర బాలికల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం కిషోర వికాసంపై అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలికల తల్లులకు ఎంపీడీఓ వరప్రసాదరావు అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యుక్తవయస్సులో బాలికలకు రక్తహీనత తదితర ఆరోగ్య సమస్యలు తలెత్తితే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆడపిల్లల సంరక్షణకు శక్తి యాప్ అందుబాటులో ఉందని, యాప్‌పై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. మాయలూరు పీహెచ్‌సీ డాక్టర్ రాబర్ట్ కెన్నెడి, వెలుగు ఏపీఎం శేఖర్, హెల్త్‌సూపర్‌వైజర్ మునిస్వామి, శక్తిటీం ఏఎస్‌ఐ నాగరాజు పాల్గొన్నారు.

కొర్ర పంటకు మద్దతు ధర కల్పించాలి

బేతంచెర్ల: కొర్ర పంటకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి రామ్ మోహన్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలో రైతులు సాగు చేసిన కొర్ర పంటను పరిశీలించి, రైతుల సమస్యను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది కొర్ర పంట క్వింటా రూ. 5వేలకుపైగా పోగా ప్రస్తుతం రూ. 2500 మించి అడగటం లేదని పెరిగిన ఖర్చులతో ఆ ధర గిట్టుబాటు కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

విపత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : ప్రకృతి విపత్తుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నాగమణి, డోన్ అగ్నిమాపక కేంద్రం అధికారి రంగస్వామి గౌడ్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలపై స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సచివాలయ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విపత్తులను ముందుగానే పసిగడితే నష్ట నివారణను తగ్గించ వచ్చునన్నారు. ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉంటుందని ఈ సమయంలో ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. వేసవి కాలంలో వడదెబ్బకు గురికాకుండా తరచూ నీళ్ల లేదా ఓఆర్‌ఎస్ ద్రావణం తీసుకోవాలన్నారు. అనంతరం గ్యాస్ సిలిండర్ ప్రమాదాలపై డెమో చేసి చూపించారు. లీడింగ్ ఫైర్‌మెన్ ప్రభాకర్, ఫైర్‌మెన్‌లు నాగేంద్రబాబు, హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొలిమిగుండ్ల: తిమ్మనాయినపేట సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగిశెట్టిపల్లెకు చెందిన మధు తీవ్రంగా గాయపడ్డాడు. కుమార్తె వివాహానికి సంబంధించిన శుభలేఖలను బంధువులు,స్నేహితులకు పంచేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. తిమ్మనాయినపేట వద్ద అదుపు తప్పి కింద పడటంతో కాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేట్ హాస్పటల్‌కు తరలించారు.

వాహనాల తనిఖీ

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– జమ్మలమడుగు ఆర్‌అండ్‌బీ రహదారిలో బుధవారం ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. నంద్యాల, ఆళ్లగడ్డ, తాడిపత్రి, బనగానపల్లె వైపు వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ద్విచక్రవాహన చోదకుల రికార్డులు పరిశీలించి రికార్డులు లేని వారికి జరిమానా విధించారు.

గ్రామాల్లో వసతుల కల్పనకు కృషి

అవుకు : మండలంలోని పలు ప్రాంతాల్లో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి బుధవారం పర్యటించారు. మండలంలోని కొండమీద గ్రామాల్లో పర్యటించిన ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. అలాగే అవుకు రిజర్వాయర్ గేట్లను పరిశీలించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఇరిగేషన్ ఏఈ జయప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

బనగానపల్లె : మండలంలోని నందవరం చౌడేశ్వరి అమ్మవారి ఆలయ అభివృద్ధికి నంద్యాల వాస్తవ్యులు గంగిశెట్టి వెంకటేశ్వర్లు, కుటుంబ సభ్యులు బుధవారం రూ.35వేల విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులు వేదపండితులకు అందజేశారు. దాతలను ఆలయ సంప్రదాయం మేరకు సన్మానించారు.

జయప్రదం చేయండి

కోవెలకుంట్ల: పట్టణంలోని జమ్మలమడుగు కూడలిలో గురువారం నిర్వహించ తలపెట్టిన ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మేడేను పురస్కరించుకుని భగత్‌సింగ్ హమాలీ సంఘం, ఏఐటీయూసీ, సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ అసోసియేషన్, అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో జెండా ఎగుర వేస్తామని, కార్మికులు హాజరు కావాలని కోరారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

బనగానపల్లె రూరల్ : ప్రభుత్వ,ప్రైవేట్ రంగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం నిర్వహించే మే డే ఏర్పాట్లుపై నాయకులతో సమావేశం నిర్వహించారు. సుంకయ్య మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు, సీం వర్కర్లు, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు,సూక్షల్లో పని చేసే ఆయాలకు ఉద్యోగభద్రత కల్పించాలని, ఎస్‌పీవైరెడ్డి ఆగ్రో కెమికల్ ఫ్యాక్టరీ, జిల్లా వ్యాప్తంగా ఉన్న విజయ డెయిరీ కార్మికులకు పనిభద్రత కల్పించాలని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లో తీసుకోవాలని కోరారు. సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శివబాలకృష్ణ, సీపీఐ సీనియర్ నాయకులు సంజీవులు,రైతు సంఘం అధ్యక్షుడు సోమన్న పాల్గొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయాలి

బనగానపల్లె రూరల్ : మండలంలో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని డ్వామా జిల్లా మానిటరింగ్ అండ్ ఇవ్వాల్యూషన్ అధికారి భాస్కర్ నాయుడు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ పనులు పూర్తయ్యాయని, కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఉపాధి పనులకు వచ్చే వారి సంఖ్య 200 మందికి తగ్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పశువుల షెడ్లు, పశుల నీటితొట్ల నిర్మాణం,ఫాంపాండ్ల పనుల టార్గెట్ పూర్తి చేయాలని చెప్పారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీఓ ప్రతాప్, ఈసీ రాజాబాబు,టీఏలు పాల్గొన్నారు.



బనగానపల్లెలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న భాస్కర్ నాయుడు

బోసిపోయిన అక్షయ తృతీయ

- వెలవెలబోయిన బంగారం దుకాణాలు



కోవెలకుంట్లలో వినియోగదారులు లేని బంగారు దుకాణం

కోవెలకుంట్ల: అక్షయ తృతీయపై ఈ ఏడాది బంగారం ధర పెరుగుదల తీవ్ర ప్రభావం చూపింది. ఆ రోజున కనీసం చిన్నపాటి బంగారు ఆభరణమైన కొనుగోలు చేస్తే ఏడాదంతా కలిసివస్తుందనేది ప్రజల భావన. అయితే బంగారం ధర ఆకాశన్నంటుతుండటంతో అక్షయ తృతీయ రోజైన బుధవారం బంగారం కొనుగోలుకు జనం సాహసించలేదు. పది గ్రాముల బంగారం ధర రూ. 97వేలకు పైగా పలుకుతుండటంతో కొనుగోళ్లు లేక నియోజకవర్గంలోని బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల పట్టణాల్లో బంగారు దుకాణాలు వెలవెలబోయాయి. బంగారం ధర పెరగడం, మరోవైపు వివిధ పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేకపోవడం అక్షయ తృతీయపై ప్రభావం చూపింది. వడ్లు, శనగలు, పొగాకు, మొక్కజొన్న, తదితర పంటలకు సరైన గిట్టుబాటు ధర లేక రైతులు విక్రయించలేకపోయారు. ఈ ఏడాది రైతుల వద్ద సైతం నగదు లావాదేవీలు లేకపోవడంతో బంగారం కొనుగోలు చేసేందుకు ముందుకు రాలేదు. కోవెలకుంట్ల పరిధిలోని బంగారు దుకాణాల్లో ఏటా రూ.20లక్షల నుంచి రూ.30లక్షల వరకు బంగారం వ్యాపారం జరిగేది. అయితే ధరల పెరుగుదల కారణంగా ఈ ఏడాది రూ.3లక్షలకే పరిమితమైందని వ్యాపార వర్గాలు తెలిపాయి.

వచ్చే వారం నుంచి పశుసంచార వాహన వైద్యసేవలు

డోన్: మరో వారం రోజుల్లో పశుసంచార వాహన వైద్యసేవలు ప్రారంభమవుతాయని భవ్య హెల్త్ సొసైటీ సర్వీసెస్ మేనేజర్ మోహన్ బాబు, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ నాగరాజు తెలిపారు. స్థానిక ఆసుపత్రి ఆవరణలో డోన్, ప్యాపిలికి సంబంధించిన వాహనాల కండీషన్‌ను పరిశీలించిన అనంతరం వారు పాత్రికేయులతో మాట్లాడారు. ఉమ్మడి నంద్యాల, కర్నూలు జిల్లాల్లో మొదటి విడత కింద 14, రెండవ విడత కింద 13 వాహనాలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ప్రతి వాహనంలోనూ డాక్టర్, వెటర్నరీ అసిస్టెంట్, డ్రైవర్ ఖచ్చితంగా ఉండేటట్లు చర్యలు తీసుకుంటున్నామన్నారు.



పశుసంచార వాహనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సీహెచ్‌ఓలను రెగ్యులర్ చేయాలి

బనగానపల్లె రూరల్ : వైద్య ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమ శాఖ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సీహెచ్‌ఓ),మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్‌ను రెగ్యులర్ చేయాలని ఆ అసోషియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ గురుప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసవధిక సమ్మె చేపట్టారు.సీహెచ్‌ఓలు మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కో ఆర్డినేటర్ వినోద్ కుమార్, సబ్‌ట్రెజరర్ హారిక, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న సీహెచ్‌ఓలు

సీనియర్ అసిస్టెంట్‌కు పదోన్నతి

కోవెలకుంట్ల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రామసుబ్బయ్యకు పదోన్నతి లభించిందని ఎంపీడీఓ వరప్రసాదరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది అక్టోబర్ నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రామసుబ్బయ్యకు ఏఓగా పదోన్నతినిచ్చి ఆళ్లగడ్డ ఎంపీడీఓ కార్యాలయానికి బదిలీ చేశారని చెప్పారు. సీనియర్ అసిస్టెంట్‌కు ఎంపీడీఓతోపాటు ఈఓపీఆర్‌డీ ప్రకాష్‌నాయుడు, కార్యాలయ సిబ్బంది అభినందించి వీడ్కోలు పలికారు.



ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డిని సత్కరిస్తున్న గ్రామస్తులు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా పెద్దమ్మ దేవర మహోత్సవం

బేతంచెర్ల: మండల పరిధిలోని వీరాయపల్లె గ్రామంలో దేవర మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. గ్రామంలోని పెద్దమ్మ, మారెమ్మ, సుంకులమ్మ దేవతలకు మహిళలు బోనాలు తీసుకెళ్లి మొక్కులు చెల్లించారు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ చంద్రుడు, జిల్లా అధికార ప్రతినిధి మురళీకృష్ణ, సర్పంచులు తిమ్మయ్య, వెంకటేశ్వర్లు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ జాకీర్ , నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, చల పతి రెడ్డి, వెంకిరెడ్డి, కుమార్ రెడ్డి, మనోహర్ నాయుడు, కాంతారెడ్డి, ఎద్దులన్న, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.